క్లుప్తంగా

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ బుల్లిమోహన్‌రెడ్డి

అనపర్తి: సుస్థిర పాలనను అందించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలిగిన సత్తా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొప్పవరంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ ఫలాలు అందించడం సీఎం జగనన్నకే సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమం సాధ్యమని నమ్ముతున్న ప్రజలు జగనన్నతోనే మా భవిష్యత్తు అని నినదిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, ఉపసర్పంచ్ వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తంపై అవగాహన సదస్సు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఈబీసీ నేస్తంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అగ్రకులాల్లోని పేదలను గుర్తించి ప్రభుత్వం ఈబీసీ పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు నలుగురు విద్యార్థుల గైర్హాజరు

రంగంపేట: మండలంలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఐదో రోజు సైన్సు పరీక్ష 582 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 578 మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు.

సంస్కృత భాషకు విశిష్ట స్థానం

రాజానగరం: సంస్కృతానికి ప్రపంచభాషలలో ఒక విశిష్ట స్థానం ఉందని, అన్ని భాషలకు ఇది మూలమని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వల్లీమాధవి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్కృత భాష, విశిష్టతలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ ఆ కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వల్లీమాధవి మాట్లాడుతూ గ్రీకు, లాటిన్, గొతిక్ తదితర భాషలన్నీ భిన్నకాలంలో సంస్కృతం నుంచే ఉద్భవించాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ ఏ.మాధవీ కామేశ్వరి, అధ్యాపకులు ఎం.సావిత్రి, ఏ.దేవీశైలజ, ఎం.లక్ష్మీపావని, ఈ.కాత్యాయిని పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి

మధురపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కోరుకొండ మండలం కోటికేశవరం, బూరుగుపూడి, గాడాల గ్రామాల్లో నిర్వహించే సభలకు ఆయన హాజరవుతారు.

నిత్యావసరాల వితరణ

మధురపూడి: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా అక్షయ సంజీవని కార్యక్రమంలో భాగంగా మధురపూడి, గాడాలలో మృతుల కుటుంబాలకు గురువారం బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. గాడాలలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మధురపూడిలో పార్టీ మండల కన్వీనర్ గణేసుల పోసి, పార్టీ నాయకుడు ఇందుగమిల్లి సత్యనారాయణ అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెదరాయవరం గ్రామానికి చెందిన వేమగిరి దుర్గాప్రసాద్ బైక్‌పై రంగంపేట వెళ్లి తిరిగి పెదరాయవరం వస్తుండగా నల్లచెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న ఇన్నోవా ఢీకొట్టింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్ తల, కుడి కాలుకి బలమైన గాయాలవ్వగా 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సీతానగరం: వంగలపూడి ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్సై కె.శుభశేఖర్ గురువారం తెలిపారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరుకు చెందిన యాళ్ల సత్తిబాబు (పండు) ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

వీరవిహారం

- హడలెత్తిస్తున్న సూర్యుడు
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

మధురపూడి: ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిపోయాయి. నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 40 డిగ్రీల నుంచి 41 డిగ్రీలకు చేరాయి. ముఖ్యంగా ఈ వారం రోజుల్లో 39 నుంచి 41 డిగ్రీలకు పెరిగాయి. మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలు గత ఏడాది కంటే ఈసారి అధికంగా ఉన్నాయి. గత సంవత్సరం ఏప్రిల్ 14న నియోజకవర్గంలో 39 నుంచి 40 డిగ్రీలు ఉన్నాయి. ఈసారి మరో రెండు డిగ్రీలు పెరిగాయి.

నిర్మానుష్యంగా రోడ్లు

పెరుగుతున్న ఎండల కారణంగా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 11 గంటలకే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం 3 గంటల వరకూ వేడిమి తగ్గడం లేదు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ప్రజలు కార్యకలాపాలను నిలిపేస్తున్నారు. దీంతో రోడ్లు, ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వెళ్లే 516 ఈ రహదారిపై కూడా వాహనాల రాకపోకలు తగ్గాయి. ఉదయం 11 గంటల లోపు, మధ్యాహ్నం 4 తర్వాత మాత్రమే ప్రజలు పనులపై బయటకు వస్తున్నారు.



బూరుగుపూడిలో నిర్మానుష్యంగా మారిన 516 జాతీయ రహదారి

ఎండలతో జాగ్రత్త



ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోజూ ఐదు లీటర్ల నీరు తాగాలి. పండ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో ఇంటిలోనే ఉండడం మంచిది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ ఇవ్వడం చాలా ఆరోగ్యకరం. – పాపారావు, తహసీల్దార్, కోరుకొండ

వైద్యులను సంప్రదించాలి



శరీరంలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ కారణంగా ఫిట్స్ పాక్షికంగా రావడం, అపస్మారక స్థితికి వెళ్లడం జరుగుతుంది. వడదెబ్బ తగిలినట్టు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. – డాక్టర్ కోటేశ్వరరావు, దోసకాయలపల్లి పీహెచ్‌సీ

చలివేంద్రాల ఏర్పాటు



తీవ్రమైన ఎండల కారణంగా రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయాల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. మధురపూడిలో జాతీయ రహదారి 512ఈ కి ఆనుకున్న ఉన్న బస్ షెల్టర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేస్తాం. యువత చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావాలి. – ఇందుగమిల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు

675 మందికి వైద్యసేవలు



పురుషోత్తపట్నంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 675 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. రోగులకు అవసరమైన పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. ఇంటి వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు వెళ్లి సేవలు అందించారు. ప్రభుత్వ స్కూల్‌ను, అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం ప్రేమజ్యోతి, ఆశావర్కర్లు నాగలక్ష్మి, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం దాత గద్దె గాంధీ సహకారంతో భోజనం వితరణ చేశారు. 150 మంది నిరుపేదల ఇళ్లకు వెళ్లి సేవాసమితి సభ్యులు భోజనం ప్యాకెట్లు అందించారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి
- కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం



కరకుదురులో స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదరికమే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ గడపకు వెళ్లిన మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మా కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారన్నారు. జగనే మా కుటుంబాలకు ధైర్యం, మా పిల్లల భవిష్యత్‌కు భరోసా, రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని ఆనందంతో కొనియాడుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణయుగ పాలన నడుస్తుందన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే నవరత్నాలను తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వుంద్రు చంద్రకళ, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్న బాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, పార్టీ మండల అధికార ప్రతినిధి వాసంశెట్టి మాధవ, మాజీ సర్పంచ్ సానా రాంబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిన రాజు, సొసైటీ డైరెక్టర్ తోటకూర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనకు మార్గదర్శకం రంజాన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రంజాన్ మాసంలో నియమ నిబంధనలతో చేసే దీక్షలు మనిషిని సత్ప్రవర్తనలో పయనింపజేస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక బాబానగర్‌లో గల ముఖరం మసీదులో అనపర్తి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ నాగూర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్ అని, రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలతో బలహీనతలు, వ్యసనాలు జయించొచ్చన్నారు. ఈ పవిత్ర మాసంలో చేసే నమాజు, దాన ధర్మాలుతో దైవ చింతన, సంకల్ప సిద్ధిని చేకూర్చుతాయని చెప్పారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కర్రి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైన పీఏసీఎస్ పరిధిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు



పైన పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి

పెదపూడి: మండలంలోని పైన గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) పరిధిలో జి.మామిడాడలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌ల్లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సహకారంతో తమ పీఏసీఎస్ పరిధిలో బంక్ ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా సహకార అధికారి, ఆప్కాబ్ అధికారుల సహకారంతో బంక్ మంజూరైనట్లు తెలిపారు. హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు స్థల పరిశీలన చేశారన్నారు. త్వరలో బంక్ ఏర్పాటు చేసి పీఏసీఎస్‌కు మరింత లాభాలు ఆర్జించడానికి కృషి చేస్తామన్నారు.

పాఠశాల ప్రారంభం రోజునే విద్యాకానుక కిట్లు



కాపవరంలో మాట్లాడుతున్న కోరుకొండ ఎంఈఓ కుశలవదొర



బిక్కవోలులో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ మధుసూదనరావు

అనపర్తి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థి చేతిలో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కేజీబీవీ రాష్ట్ర సెక్రటరీ, జేవీకే జిల్లా పరిశీలకులు డి.మధుసూదనరావు తెలిపారు. అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే స్టోరేజ్ పాయింట్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే సామగ్రిని పూర్తి స్థాయి నాణ్యతతో అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మే నెలాఖరుకే పూర్తి స్థాయిలో జేవీకే సామగ్రి స్టోరేజ్ పాయింట్లకు చేరుతుందన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్షా ఏఎంవో డి.గౌరీశంకర్, ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు

మధురపూడి: విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు కోరుకొండ ఎంఈఓ కుశలవ దొర తెలిపారు. కాపవరంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మే 15వ తేదీకి విద్యా కానుకలు మండల కేంద్రానికి చేరతాయన్నారు. వాటిని జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం జరిగిన వెంటనే విద్యార్థులకు అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్, పంపిణీ టీమ్‌లను ఏర్పాటు చేశారు. వీటికి ఎంఈఓ చైర్మన్‌గా ఉంటారు. కోరుకొండ కాంప్లెక్స్ హెచ్ఎం దొర కన్వీనర్‌గా, పంపిణీ టీమ్‌కి హెచ్ఎంలు కన్వీనర్లుగా వ్యవహరిస్తారు. సమావేశంలో ఏపీఎం ఏ.జయంతిరాజు, ఏఈపీఆర్ ఎం.సత్యప్రకాష్ పాల్గొన్నారు.


స్టాక్ పాయింట్ పరిశీలన..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ జాయింట్ డైరెక్టర్, జేవీకే ప్రత్యేక అధికారి డి.మధుసూదనరావు గురువారం పరిశీలించారు. గురువారం ఆయన విద్యాకానుక పేరుతో ఇచ్చే ఏడు రకాల వస్తువులు నిల్వ ఉంచే గదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఏడు రకాల వస్తువుల కోసం ఏడు బృందాల్ని ఏర్పాటు చేసుకుని వాటిని దిగుమతి చేసుకోవడంతో పాటు పాఠశాలలకు చేరవేయడం వరకూ బాధ్యతగా ఉండాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి తప్పు జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో గౌరీశంకర్, కోఆర్డినేటర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పాలిసెట్ శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ – 2023 కోసం రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17 నుంచి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కల విద్యార్థులు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి.

వేంద్రలో చర్చి ప్రారంభం



చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పాస్టర్లు, క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేంద్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన మోరియా చర్చిను ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధించిన మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాస్టర్లు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోసూరి వాసు, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్ బాబు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, ఫాదర్ పండు దేవదానం, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



జక్కంపూడి విజయలక్ష్మితో విజయ్ ప్రతాప్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి గురువారం స్థానిక ప్రకాశం నగర్ కార్తికేయ అపార్ట్‌మెంట్‌లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సమర్థంగా సేవలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణులకు అభినందన

ప్రకాశం నగర్: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఐ.అశ్విని ప్రియ, వై.శాంతిని గురువారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ తరపున అభినందించారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ అబేల్ రాజ్ బాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీరా గంగాధర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు పీఏ కిషోర్ బాబు, సంజీవ్, రమణ మూర్తి, కోచ్ బి.మణికంఠ పాల్గొన్నారు.

అంతరపంటగా కోకో సాగు లాభదాయకం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో మొక్కలు పెంచడం లాభదాయకమని ప్రముఖ చాక్లెట్ టేస్టర్ నితిన్ కార్డియా అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు కోకో వాల్యూచైన్‌పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ కార్డియా మాట్లాడుతూ మన కోకో రైతులు అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగే గింజలు (కోకో బీన్స్) తయారు చేయలేక పోతున్నారన్నారు. 16 టన్నుల బీన్స్ ఉత్పత్తి చేసే ఫెర్మెంటేషన్ యూనిట్ ఏర్పాటుకు రూ.28 లక్షలు ఖర్చు కాగా, ఇందులో 35 శాతం ప్రభుత్వ రాయితీ ఇస్తుందన్నారు. పదిశాతం రైతు పెట్టుబడి కాగా, మిగిలిన దానిని బ్యాంకు రుణ సదుపాయం అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు కనీస స్థాయిలో రూ.10 లక్షల్లో చాకోలెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజర్స్ పథక సంచాలకులు సుభాష్ కిరణ్ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన రైతులు, రైతు సంఘాలు ఈ పద్ధతుల గురించి, ప్రభుత్వ సహకారం గురించి మరింత సమాచారం కోసం ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ కేజే మారుతీ 7893347474ని సంప్రదించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రామ్మోహన్, సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత, జిల్లా హార్టికల్చర్ అధికారి బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

డయ్యర్ చిత్రపటాల దహనం

సీటీఆర్ఐ: జలియన్ వాలాబాగ్‌లో జరిగిన రక్త చరిత్రకు గురువారంతో 104 ఏళ్లు పూర్తయ్యాయని ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద గల స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో జలియన్ వాలాబాగ్ ఘటనకు కారకుడైన జనరల్ డయ్యర్ చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో గ్రంధి రాజా, మాదిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

23న బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం

సీటీఆర్ఐ: వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు కేటాయించిన రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలు, రాష్ట్ర ఇన్‌చార్జి వెలగల నూకాలమ్మ తెలిపారు. వీఎల్ పురంలోని గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం, దాడులు, రావాల్సిన వాటాను దక్కించుకునేందుకు చేయాల్సిన కార్యాచరణపై ఈనెల 23న రాజమహేంద్రవరంలో జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కన్వీనర్ లాకా వెంగళరావు, వై.నాగేశ్వరరావుతో పాటు 8 రాష్ట్రాల నుంచి బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు సుమారు 1500 మంది వరకు హాజరవుతారన్నారు.

16న ‘ఖడ్గధారి కందుకూరి’ నృత్యరూపకం ప్రదర్శన



నృత్యరూపకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

ప్రకాశం నగర్: కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జీవితంపై ఖడ్గదారి కందుకూరి అనే సంగీత నృత్యరూపకం ప్రదర్శిస్తున్నామని కందుకూరి జయంతి నిర్వహణ కమిటీ సభ్యుడు బి.పవన్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కె.దినేష్ కుమార్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఉచితంగా ఈ ప్రదర్శన జరుగుతుంది.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ రామారావు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం బస్‌స్టేషన్ వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బుంగా రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి మోసం

ధవళేశ్వరం: గ్రామంలోని శివాలయం వీధికి చెందిన పొక్కులూరి వెంకట శ్రీరామమూర్తి తన కుమార్తెకు సొమ్ము డిపాజిట్ చేసేందుకు స్థానిక ఎస్‌బీఐ ఏటీఎమ్ వద్దకు ఉదయం 11 గంటల సమయంలో వచ్చాడు. అతడికి అక్కడే ఉన్న సుమారు 30 ఏళ్ల వ్యక్తి సహాయం చేస్తున్నట్లు నటించి ఏటీఎమ్ కార్డును మార్చాడు. కొంత సమయానికి రూ.10 వేలు చొప్పున రెండు సార్లు డ్రా చేసినట్లు మేసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించిన వెంకట శ్రీరామమూర్తి ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వి.క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.